కథ

# యవ్వారం

— ముద్రగడ సూర్యప్రకాశరావు

ఎండా కాలపు ఎండ కరువులాగే మండిపోతోంది. ఎప్పుడూ బిజీగా వుండే ఆ జంక్షన్‌లో కూడా జనం పల్చగానే వున్నారు. అప్పుడప్పుడూ వచ్చి ఆగుతున్న బస్సుల్లోంచి దిగుతున్న వాళ్ళుకూడ ఎండ ధాటికి తట్టుకోలేక, దిగినవెంటనే పరుగులాంటి నడకల్తో ఇళ్లకు పరుగులెడ్తొన్నారు.



రోడ్డు పక్కనున్న చాలా షావులు బేరాల్లేక ఖాళీగా అగుపిస్తున్నాయి. యజమాన్లు అకౌంట్స్ చూసుకుంటూనో, పేపరు చదువుకుంటూనో, పోర్టబుల్ టీవీలో ప్రోగ్రాంస్ చూస్తూనో రిలే క్సవుతూ వుంటే, సేల్సుబోయ్సు కొందరు కబుర్లాడుకుంటూ, మరికొందరు కునికిపాట్లు పడ్తూ గడిపేస్తున్నారు. కరెంటు పోయి ఫేనాగిపోవడంతో, కిరాణా షాపు ప్రొప్రయిటర్ ఆదిబాబు విసుక్కుంటూ, చిరాగ్గా, ఇబ్బందిగా అటు ఇటు కదిలాడు.

"ఏట్రా! ఈ కరెంట్‌తో సచ్చేసావొచ్చిపడింది. ఇంతెండలు ఎప్పుడూ లేవు. వోల్‌మొత్తం దేశవంతా ఇలాగే వుండట". .అన్నాడు, **పేపరుతో విసురుకుంటూ**

"మరేనండీ! ఏడి కుతకుతలాడించేస్తంది. సాలమంది వడదెబ్బ కూడా తినేస్తున్నారు" అన్నాడు పొట్లాలు కట్టే పోలారావు.

"ఆ కిటికీ ఓపెన్ చెయ్యరా! కొంచెం గాలన్నా వొస్తాది" అని చెప్పి, కౌంటర్ దగ్గర్నించి బయటకొచ్చి నిలబడ్డాడు ఆదిబాబు. షావుముందు కొంతమేర గచ్చు చేయించాడు షావుకు అటు హార్డ్‌వేర్, ఇటు మెడికల్ షాపులున్నాయి. ఆ వరుసలో ఇంకా, స్టేషనరీ, కిరాణా, బట్టల షావులు, హోటల్ వున్నాయి. ఈ షావుల ముందున్న ఖాళీ స్థలంలో రోడ్డు కిరువక్కలా, ప్లాస్టిక్ సామాన్లు. పళ్ళు, కూరగాయలు, కొబ్బెరకాయలు చిల్లరగా అమ్మే చిన్న చిన్న దుకాణాలున్నాయి. ఒకటి రెండు చోట్ల చాపలు పరచివున్నాయి. వాటిపై సరకులు లేవు. అమ్మే మనుషులు ఎండ బాధ పడలేక, 'వ్యాపారం మాట దేవుడెరుగం'టూ ఇళ్లకు పోయారు. తన షావుముందున్న కూరగాయలమ్మే ముసిల్దాని దుకాణం వుండవలసిన చోటులో వుండక మరింత దగ్గరగా షావుమీదకొచ్చేసింది. గోనెపట్టామీద కూర్చున్న ముసిల్ది కునికిపాట్లు పడ్తోంది.

"దీనమ్మ! ఇదేటిది? రోజు రోజుకి జరుక్కుంటూ మన షావుమీద కొచ్చేస్తోందీ ముసిల్ది" కోపంగా అన్నాడు ఆదిబాబు.

"మరేనండీ! మీరలా సూస్తూ వల్లకుండిపోయారనుకొండి, అదిక అరుగెక్కి కూకుంతాది" అన్నాడు మరో పనికుర్రాడు గోవింద.

"ఆ...ఆ...ఎక్కుతాదెక్కుతాది, దానమ్మొగుడు సంపాదించింది దాసిపెట్టిందని అరుగన్నా ఎక్కుతాది, నేదంటే నానెత్తినన్నా ఎక్కికూకుంతాది" అని కోపంగా ముసలమ్మ దగ్గరకెళ్లి "ఏయ్! ముసిలీ! ఏటే నీ యవ్వారం? లెగు ....లెగు అసలేటి? నీ వుద్దేశం" ఉరుమురినట్టు అరచాడు ఆదిబాబు. ముసిల్ది తుళ్లిపడిలేచింది. ఎదురుగా గుడ్లింతలుచేసి కోపంతో గుర్రుగా తినేసేలా చూస్తున్న ఆదిబాబు కనిపించాడు.

"బాబ్బాబూ! కుసింత కనికరించండి నాయనా! సచ్చిపోతున్నాం. పేణాలు సాలొచ్చి, నీడగుందని ఇక్కడ కూకున్నాను. ఎండ తగ్గగానే ఎలిపోతాను. నాయన్నాయన నీకు ధణ్ణవెడతాను" ప్రాధేయపడింది.

"అవసరమొచ్చిందని ఇయ్యేల దణ్ణవెడతావు, రేప్పొద్దున్న నెత్తెక్కి కూచుంటావు. తల్లీ నీ దణ్ణాలకో దణ్ణంగాని... .ఎల్లెల్లు...ఎల్లి నీ సోట్లోనే దుకాణవెట్టుకో, అక్కడెండగుంటే నేనేం చెయ్యను?" చీదరించుకున్నాడు.

"ముసిలి ముండాదాన్ని బాబ్బాబూ కుసింత దయతల్చునాయనా! నీ పేరు సెప్పకుంతాను" అంది ముసలమ్మ ఎంతో వినయంగా అర్థిస్తూ.

"తత్తరిస్తున్నావేటే? ఏటేలాకోలంగా వుందా? అంతెండగుంటే? ఎల్లి ఇంటికాడ తొంగో? ఏపారాలయ్యూ ఎందుకు నీకు?" అన్నాడు ఆదిబాబు.

"బాబ్బాబూ! ఈ ఒక్కపాలికీ వల్లకో నాయినా" దీనంగా బ్రతిమాలింది.

"వొల్లకుంతున్నానుగనకే ఇంతవరకూ వచ్చింది యవ్వారం. నా షాపే దొరికిందా నీకు ఆక్రమించీ సావు. నీడ కావాలంటే అదిగో ఆ సింతసెట్టుకాడ బోల్డంతుంది"

"అక్కడ బేరాలేటొస్తాయి బాబూ! సచ్చి నీ కడుపున వుడతాను. నన్నిక్కడే వుండనియ్యి....నాయన్నాయన"


"నువ్వెందుకే బాబూ! నా కడుపున పుట్టడం? ఆ చెత్తాచెదారం అంతా ముందిక్కడ్నించి తియ్యి...." కోపంగా అరిచాడు.

ముసలమ్మ ఆదిబాబు కాళ్లు పట్టుకోబోయింది తప్పించుకున్నాడు.

"అరే! నా కాళ్ళెందుకు పట్టుకుంటావు? ఎల్లమ్మా! ఆందేవరకూ కాళ్ళా వేళ్ళా పడ్తారు, ఆ తర్వాత జుత్తందుకుంటారు" అన్నాడు.

"బీదముండాదాన్ని నాకన్ని తెలివితేటలు లేవు నాయనా" అంది.

"ఒరే! దీనికి మర్యాదగా చెప్తే వినదు. ముందా దుకాణం అక్కడ్నించి ఈడ్చిపారెయ్యండి" ఆర్డర్ ఇచ్చాడు ఆదిబాబు.



"బాబ్బాబూ!" ఆ పని మాత్రం సెయ్యకం డని ముసిల్ది ఎంత మొత్తుకుంటున్నా వినకుండా పని కుర్రాళ్ళిద్దరూ తాటాకుచాపనీ, గోనె పట్టాల్ని రోడ్డు వరకూ ఈడ్చుకెళ్లిపోయారు. తట్టాబుట్టల్ని ఫుట్‌బాల్‌ని తన్నినట్టు తన్నుకుంటూ వెళ్లారు.

ముసలమ్మ ఏడుస్తూ అంతెండలోనూ కందవ డిపోయిన కూరగాయల్నీ, ఆకుకూరల్నీ ఏరుకుని, దుమ్ము దులుపుకుని తీసుకెళ్లి, చాపమీద చేర్చింది. దుమ్ము పట్టేసిన వాటిని చూస్తుంటే ముసలమ్మకు మరింత దుఃఖం ముంచుకొచ్చింది. "ఈ కూరల్ని ఎవురు కొంటారు? నానేటి సేసేదిరా నారాయణా!" అంటూ ఏడుస్తోంది.

"ఈడి రొజ్జెయ్య! ఈడి జిమ్మడిపోను, ఈడ్నె మ్మెరు తినెయ్య" అంటూ తిడ్తూ మెటికలు విరుస్తోంది.

ఆ చుట్టుపక్కల వాళ్లు కొంతమంది...దగ్గర చేరారు...తర్వాత కిమ్మనకుండా ఎవరిదారిన వాళ్ళు పోయారు.

"ముండావూరు. ఇంతన్యాయం జరిగితే ఎవులూ పట్టించుకున్నారు కాదు. ఈ సవాది గాళ్లం దరూ సుట్టలు కాల్చుకుంటూ, ఆడేరుగుమీద సేరి, "తుప్పా....తుప్పా"మని ఉమ్ములూసేస్తే పర్లేదు గాని, ఎండగుందని నాకు అటేవు దుకాణం జరుపుకుంటే, అదంతా ఆడికి సెత్తా సెదారం అయిపోనాది" తిడ్తూ, సొణుక్కుంటూ ఏడు స్తోంది.

"ఏటే...అప్పా! ఏటలా వొల్లకుండిపోవాపు...ఆడ్ని ఝడాయించేసి జలకడిగీ వొలసింది" అడిగింది రావులమ్మ గారపళ్లికిలించుకుంటూ..దాని మాట ల్లోని వెటకారాన్ని పసిగట్టిన ముసలమ్మకు వళ్లు మండుకొచ్చింది.

"దీనెటకారం మండిపోను. బడ్డీ కొట్టెక్కగానే ఇదివ్వడు పెద్దనాయకురాలైపోయి సలహాలిస్తున్నాది. అంతకు ముందిది తన్నాగే బల్ల సెక్కట్టుకొని కుళ్ళొంకాయలు...సిక్కుడు కాయలు వొంతులేసి పుచ్చులు గిచ్చులు అమ్ముతుండేది. దుకాణా లయ్యా ఎట్టుకోడానికి గవర్నమెంటోడు అవ్వలియ్య బట్టి బడ్డీ కొట్టెట్టింది. మాట సాయంగా ఇదిగా నొస్తే ఆసరాగా నిలిస్తే తామూరుకుదో? ..ఆదిబాబు నట్టుకొని నాలుగు దులిపేదా?" గొణుక్కుంటూ సర్దుకుంటోంది ముసలమ్మ.

"ఏటయినాదే? ఇయ్యేటి...ఇయ్యన్నీ ఇలాగయి నాయి. వొపులు చేసారిలా?" అంటూ రాగానే అడిగింది చింతల్లి...

"నువ్వెందుకొచ్చినావే? ఏటి? కూడు దీసుకొ చ్చినావా?" ఆప్యాయంగా మనవరాలివైపు చూస్తూ అడిగింది ముసలమ్మ.

"నువ్వు ముందు వెగు..ఆ నీడలోకెల్లి కూకోని తినేసిరా! వొంటినిండా ఏటే సెవట్లు? ఇంతెండలో ఎందుకే కూకున్నావు? జరంగాని వచ్చీగల్దు" అంది చింతల్లి.

"ఏపీరాడుగాని నువ్వెందుకట్టుకొచ్చినావే? మీ అయ్యగాని, సిన్నోడు గాని నేరేంటి కాడ? ఎండకి తోటకూడ కాడనాగ ఓడిపోనావు" ఆప్యాయంగా మనవరాలి వళ్లు నిమిరింది.

"ముందు నువ్వు కూడు తినెయ్యే" అంది చింతల్లి.

"ఓ రెండు ముద్దలు తినిపిస్తాను, నాతోపాటు తిందుగానివి రాయే తల్లీ!" మనవరాలి గడ్డం పట్టుకుని బ్రతిమాలింది. ముసలమ్మ.

"నేను తిన్నానుగానీ, ముందు నువ్వెల్లి, ఆ నీడలో కూర్చుని తినేసిరాయే!"

"అక్కడ కూకుని తింటే ఆ దొంగసచ్చినోడు వల్లకోడే! ఇందాక అక్కడ కూకున్నానవే పెద్ద గొడవెట్టాడు. కాస్తంత సల్లబడ్డాక ఎలిపోతానన్నా ఇనిపించుకోకుండా దుకాణాన్ని ఈడ్చి పారేసాడు" బాధగా అంది ముసలమ్మ.

"ఈడ్చి పారేసాడా? ఏటే రోడ్డు ఆడిబాబుగోరి సొత్తేటి? వుండు నానెల్లడుగుతాను" రోషంగా లేచి వెళ్లబోయింది చింతల్లి.

"పోన్లేయే పెద్దోల్తో తగువెందుకు? ఎక్కడయి తేటి? ఇక్కడే కూకోని తినేస్తాను. ఈ ఎండా వానలన్నీ నాకలవాటే" అంది ముసలమ్మ చిన్నగా నవ్వుతూ.

"అయితేటి? రోజూ ఇంతెండలో కూకోని అమ్ముతున్నావా?" విస్మారంగా అడిగింది చింతల్లి. ఆమె హృదయం అవ్యాజమైన ఆప్యాయతతో మూలిగింది.

"మాకోసమని ఇన్ని కష్టాలు పడ్తున్నావా? నానమ్మా! ఎందుకే ఈ ముసిలికాలము నీకిన్ని పాట్లు? కూలిపనిచేసి అయ్యట్టుకొస్తోన్న డబ్బులు చాల్దంతేదనేగా నీ బాధంతాను..." చింతల్లి కళ్ళల్లో కన్నీరు గిర్రున తిరిగి నేలరాల్తోంది.

"ఎండిసేప ముక్కగాని వొట్టుకొచ్చినావేటే? సింతల్లీ! ఏదీ ఆ కూడిట్టాగియ్యి ఆకలేస్తంది" ఆశగా చూస్తూ అడిగింది ముసలమ్మ.

"ఇదిగో ముసిల్దానా! మాట తప్పించడానికి చూడొద్దు. ముందు నానడిగినదానికి సమా ధానమిచ్చి...అవ్వడు ఇంకేదన్నా అడుగు. అయ్యకి నలుగురాడపిల్లలని, ఆళ్ల పెళ్ళిళ్లకోసం...సాయం చెయ్యడానికి నువ్విన్ని అవస్థలుపడ్తున్నావని నాకెరి కేగాని, ఈ ఎండలు తగ్గిందాకా నువ్వు దుకాణం ఎట్టొద్దు...ఇక ఎండుచేపముక్క పొద్దుగాల అయ్య తినేసాడే, రేత్రికి తిందుగానివిలే..చెప్తానయ్యకి. పట్టు కొస్తాడు. నీడలో కూర్చున్నందుకు ఎవడూ ఏమీ అనడుగానీ...పద" అని దగ్గరుండి మామ్మని కిరాణా కొట్టు పక్కనున్న నీడ పట్టుకు తీసుకెళ్లి కూర్చో బెట్టింది చింతల్లి.

గుంటకి నానంటే ఎంతో ఇది. ఏటి ఎండలో కూకుని తింటే, నానేం అరిగిపోతానా, తరిగిపో తానా? అనుకుంది. దాంతో ఎండిపోయిన పెదవులమీద చిన్న చిరునవ్వు అలముకొంది.

అల్యూమినియమ్ కేరేజి కవ్వల్లో అన్నం కలు పుకుని రెండు ముద్దలు నోట్లో పెట్టుకుంది. తెలకపిండొడియం ముక్క నంజుకుంది. మరో ముద్ద నోట్లో పెట్టుకునేంతలో పెద్దపులి గాండ్రిం పులా ఆదిబాబు అరుపులు వినిపించాయి.

"ఏటే! మల్లొచ్చినావేటి? ఏటి చెప్తుంటే

నీక్కాదా?...ముందు లెగక్కడ"

"కూడు తిన్నాక లేసెల్లిపోతాన్లే బాబూ...అయిపోయింది...ఇక రెండు ముద్దలు" అంది ప్రాధేయపడ్తూ.

"కూడు తిన్నాకగాని ఎల్లవన్నమాట. ఇక్కడంతా ఎంగిలి చేసేస్తున్నావు ముందిక్కడ్నించి లెగు...నీకు మా షాపే తేరగా దొరికినట్టుంది" చీదరించుకుంటూ దురుసుగా అరుస్తూ వచ్చాడు. అతని ధోరణి చూస్తుంటే, మరోక్షణం ఆగితే తంతాడేమోనసిపించింది ముసలమ్మకి.

"పోతున్నాన్లేరా బాబూ! గింజాకు సచ్చిపోతున్నావు" సాణుక్కుంటూ ఎండలో వున్న తన దుకాణం దగ్గరకొచ్చేసింది ముసలమ్మ.

"పోగాలవొచ్చిపోతాడు పొగరుమోతు నాకొడుకు...." తిడ్తూ గోనెపట్టామీద కూలబడిపోయింది.

"ఏటేడు? అలా ఇరగబడిపోతున్నాడు? బాతుగుడ్లలా ఇంతలేసి గుడ్లేసుకుని..ఎగిరెగిరిపడ్తున్నాడు" అంది చింతల్లి.

"ఆ...ఆ...పడ్తాడు పడ్తాడు..అలా సూస్తుండ రోగవొచ్చిపోతాడు. ఎంగిలయిపొద్దట...పాన్నేయే దేవుడిచ్చిన బూవీ ఆకాశం వుండగా ఆడి జాగాలో కెళ్ళాల్సిన అవసరం నాకేటి?" మిగిలిన అన్నం తినేసి, చెయ్యి కడుక్కుని ఆ గిన్నెల్ని చింతల్లికిచ్చేసింది.

"బద్దిరం తల్లీ! జేగర్తగా ఎల్లిరా! రోడ్డుకి పక్కంటే ఎల్లు..దొంగ సచ్చినోళ్ళు తాగేసి, వొళ్ళూ మిన్నూ గానక బళ్ళు నడుపుతుంటారు" అంది మనవరాల్ని సాగనంపుతూ.

ఇంటికి బయలు దేరింది చింతల్లి. మామ్మకు జరిగిన పరాభవానికి గాయపడిన ఆమె మనసు పరిపరివిధాల పోతోంది.

"ఆడిసొమ్మేం పోయిందని నీడలో తింటున్న దాన్ని తగిలేసాడు. పాడు బుద్ధులెదవ...ముసిల్దానిమీద జాలీ దయా లేకుండా...ప్రవర్తించాడు" ఆది బాబు మీద కోపంతో ఆమె మనకు కుతకుత ఉడికిపోతోంది. డబ్బులు చూసుకుని నానమ్మకు ఓ తాటాకుల గొడుగు కొనాలి. దానికింద చల్లగా వుంటాది. ఆ గొడుగు దుకాణానికి అడ్డంగా వుందని మళ్ళీ ఈడేదన్నా కిరికిర్లు పెడ్తే? అదో గొడవ ఆడితో...ఈ ఎండ బాధ నుండి మామ్మని ఎలాగైనా తప్పించెయ్యాలి..లేకపోతే...ఎండలో పడి వడదెబ్బ తింటే వయసులో బతకడం కష్టం అనుకుంది చింతల్లి.

* * * * * *

ఇదెవర్తిరా గుంట పిటపిటలాడిపోతోంది అనుకున్నాడు ఆరోసారి ఆదిబాబు. ముఖం అగుపడ్డంలేదుగాని ఎనకనుండి బ్రెహ్మాండంగా వుంది. మనసంతా అటే లాగేస్తోంది. కాని షాపులోంచి అస్సలు కదలటానికి వీలుపడ్డంలేదు. సరుకులు రావడంతో వాటిని లెక్కచూసుకుంటున్నాడు. అనుకోకుండా అప్పడప్పుడూ చూపులన్నీ అటువేసే వెళ్తిపోతున్నాయి. ముసిల్దాని కొట్టుమీద కూర్చుని కూరగాయలు ఆకు కూరలు అమ్ముతోందని. పదకొండయేసరికి తనకూ తీరకయింది. దాని బేరాలూ తగ్గిపోయాయి.

షాపునుండి బయటకొచ్చి నిలబడ్డాడు. అప్పటికే ఎండ బాగా తీవ్రరూపం దాల్చింది. దాని వీపంతా చెమటతో తడిసిపోయింది. ఎంతో పొందికగా వున్న ఆమె శరీరంపైనే వున్నాయి అతని చూపులన్నీ. ఎంతసేపు చూసినా తనివితీరడంలేదు. దుకాణం ముందుకెళ్లాడు ఆదిబాబు, అప్పుడు కనిపించిదామె ముఖం.

ఎంతో అందంగా వుంది. చూస్తుంటే కళ్లు చెదిరిపోతున్నాయి.

"ముసలమ్మ ఇయ్యాల రాలేదా?" అడిగాడు ఆదిబాబు.

"లేదు...జరవొచ్చేసింది. అదంతా మీ పుణ్ణెమే బాబూ! సావుకారుగోరూ!...నీడలో కూకుని అన్నం కూడ తిన్నియ్యలేదుమీరు. మిట్ట మధ్యాహ్నం ఎండలోకి తగిలేసారు" అంది చింతల్లి నిష్ఠూరంగా.

"అరరే! ఎంతపనయిపోయింది. ఏదో అనుకోకుండా అలాగయిపోయింది. ఇలా జ్వరం వస్తుందంటే అలా పొమ్మనేవొడ్నేకాదు. రోజు రోజుకి జరుక్కుంటూ కొట్టుమీదకొచ్చేస్తోందని కోపంవచ్చి, ఏదో ఓ మాట అన్నాను. ..అంతే! పాపం చాలా ఎండగా వుందే పిల్లా..చెమటతో ఎలా తడ్సిపోయావో చూడు. ఇక నువ్వా ఎండలో వుండొద్దు.. నీక్కూడ జరం వొచ్చేస్తాది...ఇప్పటికే నీ వొళ్ళెలా కంది పోయిందోచూడు...వెంటనే ఈ నీడలో కొచ్చెయ్!" అన్నాడు ఆదిబాబు ఎంతో అభిమానం కురిపిస్తూ.

"వొద్దులెండి బాబు! ఎండో కొండో..ఇక్కడే పడుంటాం..ఇయ్యాల జాలిపడి....నీడలోకి రమ్మంటారు....రేపు.. .మీ జాగా ఏదో మేం ఆక్రమించీస్తాం అంటూ మెడబట్టి గెంటుతారు" అంది చింతల్లి.

"ఆ! ఆ!...అలాగేం జరగదు ఈ ఆదిబాబు ఒక్కసారి మాటిచ్చాడంటే ఆ తర్వాత తప్పడం అంటూ ఎప్పుడూ జరగదు.. .కావలిస్తే ఇదిగో చేతిలో చెయ్యేసి చెప్తున్నాను" చెయ్యందుకోబోయాడు.

గభాలున చెయ్యి వెనక్కి లాగేసుకుంది చింతల్లి.

"నిజంగానే అంటొన్నారా? మాట తప్పరుకదా!" అడిగింది కంటి కొసల్నించి చూస్తూ చింతల్లి.

"ఇక్కడికన్నా ఇంకా ముందుకు లాగేసుకో ఏం ఫర్వాలేదు..ఇదిగో ఈ గట్టుమీద పెట్టుకున్నా నాకేం అభ్యంతరం లేదు. ఇంకా ఆ ముసిల్ది ఏం కష్టపడ్తుందిలే..నువ్వే రోజూ వచ్చి ఏపారం చేసుకో! ఏం..." చెప్పాడు. ఆలోచిస్తూ నిలబడింది చింతల్లి.." నానమ్మకు తెలిస్తే ఏవంటుందో? వప్పకోదు. సిన్నదాన్ని తగిలేసారు కదా!....అందుకని వప్పకోదు. అయినా మా బాధలేవో మేం పడతాంలెండి" అంది సుస్మితంగా ఆదిబాబు ఔదార్యాన్ని తిరస్కరిస్తూ.

"ఆ ముసిల్దానికి నేను చెపుతాగా...నేను ఒప్పిస్తాను. నువ్వు ఇకనేం ఆలోచించొద్దు గంప పట్టుకో...నేను సాయం పడతాను" అన్నాడు.

"అబ్బెబ్బే! మీకెందుకండీ....శ్రమ..మీ కుర్రోల్ని పంపించండి...సామాన్లు కొంచెం సాయం పడతారు" అంది చింతల్లి.

"ఎందుకులేవే నేను సాయం పడ్తానుగా...పట్టు" అన్నాడు ఆదిబాబు.

గంపలు ఎత్తి పట్టుకుంటున్నప్పుడు, వంగి వాటిని అరుగు దగ్గరగా పెడ్తోన్నప్పుడు, చూపుల్ని అరుగుమీద పరచుకుంటున్నప్పుడూ...చింతల్లి అందాల్ని తనివితీరా చూశాడు ఆదిబాబు. యవ్వనం వుంజుకుంటోన్న అందాలవి. గుండె ఝుల్లుమంది. మధురమైన బాధ మనసులో రగిలింది. కూరగాయల్ని, ఆకుకూరల్ని అరుగుమీద చాపపై పేర్చుకుంది చింతల్లి. సాయంత్రం అవకుండానే మొత్తం అంతా అమ్మేసి, ఆదిబాబుతో చెప్పడానికి వచ్చింది. మాటిమాటికి ఆదిబాబు వచ్చి ఆమె యోగక్షేమాలన్నీ చూస్తూ, విచారిస్తూనే వున్నాడు ఈలోవుగా "నా వయసేటిలా తిరగిపోయినట్టుంది?" అనుకుంటున్నాడు.

"అదేటే? అప్పడే అన్నీ అమ్మేసావా? ఇయ్యాల చాలా కొంచెం తెచ్చినట్టున్నావు. రేవు ఎక్కువ కూరలు పట్రా! నీ దగ్గర డబ్బుందో లేదో? ఇదిగో ఈ వందా పట్టుకెళ్లు...సరిపోద్దా లేక మరో రెండొందలు ఇమ్మంటావా?.. నువ్వీ డబ్బులు తిరిగిచ్చీయాల్సిన అవసరం లేదులే!" అన్నాడు చేతిలో డబ్బులు పట్టుకొని ఇవ్వబోతూ.

"వొద్దులెండి బాబూ! నాదగ్గిరా డబ్బులున్నాయి. రేవు సరకులెక్కువగానే తెస్తాన్లెండి..." అంది వెళ్తూ. వెళ్తున్న దానినడకలో ఎన్నో హొయలు కనిపించాయతనికి. ఆమె వెళ్తోన్నవైపు అలా చూసుకుంటూ నిలబడిపోయాడు ఆదిబాబు.

* * * * * *

మర్నాటి ఉదయం గంపల్తో రేకులు చాప, గోనె పట్టాలు సైకిల్ రిక్షాలో వేసుకుని వచ్చిన చింతల్లి, 'అరుగుమీద దుకాణం పెడ్తామా? మానేద్దామా?' అని సందేహిస్తోంది.

"ఏంటే? ఆలోచిస్తొన్నావు? అరుగుమీద దుకాణం ఎట్టుకో! కొంచెం సాయం చెయ్యండ్రా" అంటూ తన షాపులో కుర్రాల్ని ఆదేశించాడు ఆదిబాబు. కుర్రాళ్ళిద్దరి సహాయంతో చింతల్లి దుకాణంమీద సరుకులన్నింటినీ సర్దుకుని కూర్చుంది. మరి కాస్సేపట్లోనే కొంటానికొచ్చిన వాళ్ళందరికీ కూరగాయల్ని అమ్మడంలో బిజీ అయిపోయింది.

"ఆదిబాబుగోరు దేవుల్లాంటోరు, మనసు సానా మంచిది. సోయంగా ఆయనే, ఎండలో మాడుతున్న మమ్మల్ని చూసి..జాలిపడి...దయతల్చి..ఈ అరుగుమీద దుకాణం పెట్టుకొమ్మన్నారు" అంది చింతల్లి కొంటానికొచ్చిన వాళ్ళందరితో...ఎంతో సంబరపడ్తూ.

"దాందేవుందే...మనుషులం...అపాటి ఒరికొకర్రం సాయం చేసుకోకపోతే ఎలా?" అంటున్నాడు ఆదిబాబు.

"అయినా పేదోళ్ళమీద అంత అభిమానం చూపించేవాళ్లు ఎవరుంటారు బాబూ!" అన్నారు

కొంతమంది కొంటానికొచ్చిన వాళ్లు.

"ధర్మ ప్రభువులు మీలాంటోళ్ళు కొందరున్నా వుండబట్టి లోకం ఇలాగన్నా వుంది" ఆదిబాబు ఔదార్యాన్ని ప్రశంసించారు మరికొంతమంది.

ఇంతలో అక్కడికి రిక్షా వచ్చింది. రిక్షాలోంచి కిందకు దిగింది ముసలమ్మ. ఆ వెనుకనే రెండు గంపల నిండా కూరగాయల్ని తీసుకొచ్చి అరుగు మీద పెట్టాడు రిక్షావాలా. ఓ రెండు గోనెమూటల నిండా కూడా కూరగాయలు తెచ్చింది.

"ఏవే! జ్వరం తగ్గిందా? ఆ ఎండలో ఏం వుండగలరులెండి...ఆ....ఈ అరుగుమీద ఏపారం చేసుకొమ్మన్నాను... ఎవరన్నా బాగుపడ్డవేకదా మనక్కావలసింది" అన్నాడు ఆదిబాబు పలకరిస్తూ.

"నిజంగా ఆ పరమేస్సరుడే మా...మొరాలకించి...మీ రూపంలో వచ్చి, ఇలా ఇన్ని వరాలిచ్చి మమ్మల్ని ఆదుకున్నాడు బాబూ" అంది ముసలమ్మ ఆదిబాబుకు నమస్కారం చేసి.

సాయంత్రంలోగానే మొత్తం కూరగాయలన్నీ అమ్మేసారు ఇద్దరూ కలసి, ఇంటికి వెళ్లేముందు ఆదిబాబుతో చెప్పడానికొచ్చారు.

"ఆ కూరగాయలన్నీ కొంటానికి డబ్బులెక్కడియ్యే" అడిగాడు.

"మా దుకాణాలకి అప్పలిచ్చే ఆదినారాయణ దగ్గర తీసుకున్నాం. అమ్మిందాంట్లో ఏ రోజుకా రోజు...కొంత కొంత సాయంత్రం వొచ్చి వసూలు చేసుకుంటాడు" అంది చింతల్లి.

"అదేంటే? ఇక్కడ నేనుండగా ఆడిదగ్గిరా, ఈడిదగ్గిరా తీసుకోవాల్సిన అవసరమేటి?" బాధగా డిగాడు ఆదిబాబు.

"తమరికెందుకులెండి బాబూ అనవసర శ్రమ. కొట్టు ఎట్టుకొమ్మని సోటు సూపించారు అదిసాల్దా? అదే పదేలు" అంది ముసలమ్మ.

"ఆ బాబుగారు! రేపట్నుంచీ మా మామ్మే వచ్చి దుకాణంమీద కూర్చుంటాది. నాకు రాటానికి కుదర్దు. రేపట్నుంచీ స్కూల్సు అన్నీ తెరుస్తున్నారు కదా...గర్ల్స్ స్కూల్లో నేను ఎటెండర్‌గా పనిచేస్తున్నాను. రేపట్నుంచీ స్కూలుకెళ్ళిపోతాను" అంది చింతల్లి.

ఆదిబాబు గుండెల్లో రాయిపడ్డట్టయింది. "ఏంటే? నువ్వు స్కూల్లో పని చేస్తున్నావా? మరి చెప్పావు కాదేం? అయినా నువ్వు రాకపోతే మీ దుకాణానికి 'కళ' **వుండే!** సుబ్బరంగా లాభాలొస్తున్న యాపారం చేసుకోకుండా, ఈ ఉద్యోగలయ్యా ఎందుకే అరువు చాకిరీ" అన్నాడు ఆదిబాబు.

"సదువుకున్నాను కదండీ...ఖాలీగుండడం ఎందుకని...చేరాను. యాపారం చెయ్యడానికి మా, మామ్మున్నాది కదా! అది చూసుకుంటాది. ఈ మద్దిన మాకు శలవులు గదా. అందకని వొచ్చి కొట్టుమీద కూర్చున్నాను" అంది.

"ఎక్కడ సూసినా పోకిరీ ఎదవలెక్కువైపోయారు బాబూ! అందుకని దీన్ని దుకాణంమీద కూకోపెట్టడంనేదు" అంది ముసిల్ది.

"సార్రీ! ఈ సంగతేదో ముందే తెలిస్తే ఎంతో భాగుండేది కదా! నిన్నిరకాటంలో పెట్టేసి ఈ గుంట భలేగా **తప్పించుకుపోయింది** అనుకున్నాడు ఆదిబాబు.

"అప్పడప్పడన్నా ఏీలు చూసుకొని వచ్చి కనిపిస్తుండు" ఆ మాటలు గొంతుదాటి బైటకు రాలేదు. **'కక్కలేకా, మింగలేకా'** అన్నట్టు తయారైంది వా పరిస్థితి...ఈ యవహారం ఎందుకిలా తయారైంది? తాను అనవసరంగా 'తొందరపడి పోయాడు' లోపల్లోపల మధనపడిపోతున్నాడు ఆదిబాబు.

"ఎల్లొస్తానండయగోరూ!" అంది చింతల్లి. మౌనంగా తలూపాడు ఆదిబాబు. వెళ్తొన్న చింతల్లి వైపు అలా దిగులుగా దివాళా తీసిన వ్యాపారిలా చూస్తూ నిలబడిపోయాడు ఆదిబాబు.

సాయంత్రం ఐనాసరే బైట ఎండ మాత్రం చిటపటలాడించేస్తోంది.

---

## విన్నపాలు

# ద్వారం వారు

స్వప్న సుమం మెల్లమెల్లగా విచ్చుకుంటూంది ఇచ్చుకుంటూంది సూర్యకిరీటపు తొలిద్యుతిలో ఓ అజ్ఞాత బాల్యపు చిర్నగవు విచ్చుకుంటూంది లేగ దూడలు పాల మీగడ కాలువల పక్కన పర్వెదుతుంటాయి పసి పాపల చర్మపు గోళ్ళు తల్లి స్థనాల్ని గిచ్చుతుంటాయి రాత్రి సమయంలో ఏదో మిలమిలా మెరుస్తోన్న సూర్యక్షణం తమస్సులో తడబడుతూన్న నను తడుముకునే తమ హస్తం నీదేనా ఏమిటోలే అన్నానికి వస్తావా అంటావు కానీ ఏవేళవుతుందో ఏమిటోలే ఈ చిక్కని ఆకుపచ్చని చీకటి గుబురులో విరిసి ఎగసి పడ్తోన్న రేపటి నిప్పరవ్వ నీ నవ్వు నా ఆత్మ తేజో రుధిరపు మంకెన పరాగాన్ని నీ కన్నీటి ప్రమిదలోంచి కాంచలేని అంధకుడ్ని అమవసనాడు అలలఘోషకి తాకిడికి చెక్కిళుల చీకటులలో అన్నంటయానికి అన్న సమయానికి వొస్తానో రానోగానీ మృదువైన పాషాణం మీదకి మెల్లగా జారిపోతున్నాను నాసర్ప పక్షుల రెక్కల్ని విరుచుకునే కెరటాల తొడల్నీ నాస్వర్గ సంకెళ్ళనీ సర్వాన్నీ ద్వారం వారి ద్వారా ఇచ్చేస్తున్నాను

మో

---